క్లుప్తంగా

బకాయిలు విడుదల చేయాలి

జూలూరుపాడు: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బోడా అభిమిత్ర మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ డిగ్రీ, పీజీ, జూనియర్, పారామెడికల్ కళాశాలల యజమాన్యాలు బంద్ చేస్తుంటే ప్రభుత్వం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గిర్దావర్ తిరుపతిరావుకు అందజేశారు. కార్యక్రమంలో పి.పవన్, కిశోర్, సాయి, ప్రశాంత్, రవి పాల్గొన్నారు.

అధికారులు జోక్యం చేసుకోండి

ఇల్లెందు: ఎల్టీఆర్ కేసు నడుస్తున్నా గిరిజనేతరుడు అక్రమంగా ఆ భూమిలో ఇళ్లు నిర్మిస్తున్నాడని, అధికారులు జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొగ్గెల రామస్వామి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని విజయలక్ష్మీనగర్‌కు చెందిన సర్వే నంబర్ 588/160/21లో గొగ్గెల ఆదిలక్ష్మికి ఐదు ఎకరాల భూమి ఉందని, దీనిని సత్యనారాయణపురానికి చెందిన గిరిజనేతరులు తమదేనంటూ నాలుగేళ్లుగా నిర్మాణాలు చేయబోతున్నారని, పలు దఫాలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. తాజాగా ఇంటి నిర్మాణం చేపట్టారని చెప్పారు. ఈ విషయమై కలెక్టర్‌కు, ఐటీడీఏ పీఓకు వివరించినట్లు వెల్లడించారు.

బాడీ లారీలకు బొగ్గు ఇవ్వండి

ఇల్లెందు: అర్ధాకలితో అలమటిస్తున్న బాడీ లారీల యజమానులకు బొగ్గు ఇవ్వాలని టీయూసీఐ డిమాండ్ చేసింది. శనివారం టీయూసీఐ నేత, బొగ్గు లారీ లోడింగ్, అన్‌లోడింగ్ లెవలింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు యాకుబ్‌షావలి మాట్లాడుతూ ఇల్లెందు జేకేఓసీలో బొగ్గు వెలికి తీస్తున్నారని, ట్రిప్పునకు ఐదు బాడీ లారీలకు బొగ్గు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

దరఖాస్తు చేసుకోండి..

కొత్తగూడెంఅర్బన్: యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో అందిస్తున్న పలు కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా శనివారం ఒక ప్రకటనలో కోరారు. యూనివర్సిటీలో స్కూల్ ఆఫ్ హెల్త్ కేర్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్, ఈ-కామర్స్ వంటి విభాగాల్లో పలు కోర్సులను అందిస్తున్నారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29వ తేదీ లోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

30న ప్రియదర్శిని కళాశాలలో జాబ్‌మేళా

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి బస్టాండ్ ఏరియాలోని ప్రియదర్శిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో టాస్క్ సౌజన్యంతో జెన్ ప్యాక్ట్ ఎంఎన్‌సీ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన బుధవారం జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నయీంపాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, వరంగల్‌లో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు ప్రియదర్శిని కళాశాలలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు వివరించారు. పూర్తి వివరాలకు 96661 23434, 95158 31984 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అందరి సమక్షంలో గుర్తించాలి

సింగరేణి(కొత్తగూడెం): అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో లబ్ధిదారులను గుర్తించాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కొత్తగూడెం డివిజన్ నాయకులు పెద్దబోయిన సతీశ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుపై లబ్ధిదారులను గుర్తించేందుకు ఏర్పాటు చేసే కమిటీల్లో గ్రామస్థాయిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అఖిల పక్ష పార్టీలు, గ్రామపెద్దలను కలుపుకొని అవినీతి జరగకుండా చూడాలని కోరారు.

‘సేవాలాల్’ మండల అధ్యక్షుడిగా మురళి



నియామకపత్రం అందిస్తున్న ప్రసాద్‌నాయక్

పాల్వంచ: సేవాలాల్ బంజారా సంఘం మండల అధ్యక్షుడిగా భట్టు మురళీనాయక్ నియమితులయ్యారు. శనివారం స్థానిక బంజారాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు లావుడ్య ప్రసాద్‌నాయక్ మండలాధ్యక్షుడిని ఎన్నుకుని నియామకపత్రం అందించారు. భూక్యా రవినాయక్, బానోతు నగేశ్ నాయక్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సకల కళాకోవిదుడు..

- బహుముఖ ప్రతిభతో రాణిస్తున్న శ్రావణబోయిన నర్సయ్య
- తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడిగా గుర్తింపు
- మరోపక్క కళాకారుడిగానూ ప్రతిభ


అల్లూరి సీతారామరాజు వేషధారణలో నర్సయ్య


వీరబ్రహ్మేంద్రస్వామి వేషధారణలో..

కొత్తగూడెంటౌన్: అల్లూరి సీతారామరాజు, వీరబ్రహ్మేంద్రస్వామి, వేమన వేషధారణల్లో అలరిస్తూ.. నాటికల్లో ఏక పాత్రాభినయాలతో పాటు రచనలతో ఆకట్టుకుని, ఇటు కార్మిక సంఘం నాయకుడిగా తొలి, మలి తెలంగాణ ఉద్యమకారుడిగా అందరికీ సుపరిచితమైన పేరు శ్రావణబోయిన నర్సయ్య. కొత్తగూడెం పట్టణం గాజులరాజం బస్తీకి చెందిన నర్సయ్య పాల్వంచలోని ఏపీ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగిగా పనిచేశారు. అది మూతపడటంతో సొంతంగా చిరువ్యాపారం ప్రారంభించారు.

నాటికల్లో రాణింపు..

ఏక పాత్రాభినయం చేయడంతో పాటు పలు వేషధారణలతో ఆకట్టుకోవడంలో దిట్ట. పాఠశాల స్థాయి నుంచి నాటకాల్లో నటించారు. అదే సమయంలో స్వాతంత్ర్య సమరయోధులు, దేవుళ్ల వేషధారణలతో రాణించారు. పాఠశాల స్థాయిలో జరిగిన నాటికల్లో ద్రౌపతి వేశధారణతో ఆకట్టుకున్నారు. 1991లో తిరుమల తిరుపతి దేవస్థానం కళా పరిషత్‌లోఅల్లూరి సీతారామరాజు వేషధారణ ప్రదర్శన, ఆపై రాష్ట్రవ్యాప్తంగా జరిగిన కళా ప్రదర్శనల్లో పాల్గొని అల్లూరి సీతారామరాజు, వేమన, వీరబ్రహ్మేంద్రస్వామి, బ్రహ్మర్షి విశ్వామిత్ర వేషాలు వేసి మంచి నటుడిగా గుర్తింపు సాధించారు. 1985 నుంచి 2000 వరకు రచయితగా లోకం పోకడ, స్వాతంత్ర్యమా స్వాహాతంత్రమా, పల్లె జీవనం, కూతురిపై కన్నవారి కథ, శ్రావణ శతకం, తొలి రచన వంటి కవితలు, వచన కవితులు రాసి పేరు తెచ్చుకున్నారు. 1994లో శ్రావణ శతకాలు, సమాజంలో స్త్రీపాత్ర కవిత రాశారు. వీటిని న్యాయవాదులు తమ మేగజైన్‌లో ముద్రించడం విశేషం.

తెలంగాణ ఉద్యమకారుడిగా..

బాల్యం నుంచి నాయకత్వ లక్షణాలు కలిగిన శ్రావణబోయిన నర్సయ్య తెలంగాణ ఉద్యమంలో కూడా తనవంతు పాత్ర పోషించారు. తొలిదశ తెలంగాణ ఉద్యమం (1969)లో చురుగ్గా పాల్గొన్నారు. మలిదశ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. ప్రస్తుతం ఉద్యమకారుల సమస్యలపై పోరాటం చేస్తున్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వం ప్రత్యేక స్థానం ఇవ్వాలని, పలు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం కళాకారులను గుర్తించాలని, పథకాల్లో భాగంగా బస్సులు, రైళ్లలో రాయితీలను కల్పించాలని, ప్రతి కళాకారుడు ఆర్థికంగా బలపడేందుకు సాయం అందించాలని, పింఛన్లు అందజేయాలని కోరుతూ గత ముఖ్యమంత్రి కేసీఆర్‌ను, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. ఇప్పటికీ ఉద్యమకారుల పక్షాన ఆందోళనల్లో పాల్గొంటూనే ఉన్నారు.

ఉద్యమకారులను గుర్తించాలి..



తెలంగాణ తొలితరం ఉద్యమకారులకు సముచితస్థానం ఇస్తామని గత ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. కానీ, మాట నిలబెట్టుకోలేకపోయారు. ఇప్పటి ప్రభుత్వమైనా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి. వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి. అలాగే, కళాకారులకు కూడా అన్ని పథకాలు అందేలా చూడాలి. రాయితీలు కల్పించాలి

–శ్రావణబోయిన నర్సయ్య

నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి


ఆనందరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/కొత్తగూడెంఅర్బన్/కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించిన ఫలితంగా కుడా ఏర్పాటు కోసం జీఓ 177 జారీ అయిందని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుడా ఏర్పాటుతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. కొత్తగూడెం, పాల్వంచను కలిపి కార్పొరేషన్ ఏర్పాటుకు, కేఎస్ఎంను జేఎన్టీయూ మాదిరి అటానమస్ యూనివర్సిటీగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని, కలెక్టర్ కూడా సహకరిస్తున్నారని వెల్లడించారు. వెయ్యి ఎకరాలలో జూపార్కు, రామవరంలో విమానాశ్రయం, కొత్తగూడెం – పాల్వంచ బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నానని చెప్పారు. ఎస్కే సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, దుర్గరాశి వెంకన్న, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, కంచర్ల జమలయ్య, అడుసుమల్లి సాయిబాబా, భూక్య శ్రీనివాస మాచర్ల శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్‌కుమార్, సత్యనారాయణచారి, కోటం రాజు, సుధాకర్ తదితరుల పాల్గొన్నారు. కాగా, మున్సిపాలిటీ పరిధిలోని 14, 28, 29, 26 వార్డుల్లో రూ.1.90 లక్షల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు శనివారం ఎమ్మెల్యే కూనంనేని శంకుస్థాపన చేశారు. 26వ వార్డు పరిధిలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజన్ స్వామితో పాటు అధికారులు రవికుమార్, శ్రీనివాస్, నవ్యజ్యోతి, అశోక్‌చౌహాన్ పాల్గొన్నారు. కాగా, సింగరేణి రిటైర్డ్ జీఎం ఆనందరావు దిశ కమిటీ సభ్యులుగా నియమితులు కాగా.. ఆయన్ను ఎమ్మెల్యే సన్మానించారు. మద్దెల శివకుమార్, నాగా సీతారాములు, అల్లి అశోక్, అంతోటి పాల్ పాల్గొన్నారు. కాగా, సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం 166 మంది లబ్ధిదారులకు శేషగిరి భవన్‌లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అందించారు. వాసిరెడ్డి మురళి, ఫహీం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల త్యాగం అజరామరం


ఇల్లెందు: రక్తదానం చేస్తున్న పోలీసులు


పాల్వంచ: రక్తదానం చేస్తున్న అప్పాజీ

ఇల్లెందు: పోలీసుల త్యాగం అజరామరమని డీఎస్పీ ఎస్.చంద్రభాను కొనియాడారు. శనివారం ఇల్లెందు పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఇల్లెందు, గుండాల, టేకులపల్లి మండలాల యువకులు, పోలీస్ అధికారులు రక్తదానం చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన డీఎస్పీ చంద్రభాను మాట్లాడారు. ఇల్లెందు, టేకులపల్లి, గుండాల సీఐలు బత్తుల సత్యనారాయణ, పి.సురేశ్, శ్రీనివాస్‌తోపాటు సబ్ డివిజన్‌కు చెందిన ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, యువకులు రక్తదానం చేశారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలు మరువలేనివని, పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయమని డీఎస్పీ పేర్కొన్నారు.

పాల్వంచలో..

పాల్వంచ: పోలీస్ అమర వీరుల త్యాగాలు మరువలేనివని పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్, ఎస్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అప్పాజీ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐ సుమన్, రాఘువయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎంను అభినందించిన ఎమ్మెల్యే


జీఎంను అభినందిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బొగ్గు ఉత్పత్తి కంపెనీల్లో ప్రమాదరహిత గనులకు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నుంచి అవార్డు అందుకున్న ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య అభినందించారు. శనవారం జీఎం కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మహబూబ్, బాబూరావు, అన్వర్, నాగేశ్వరరావు, మధుకుమార్ పాల్గొన్నారు.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

పాల్వంచ: ఈ నెల 28న రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక అయ్యప్పనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సేవా కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, మహిపతి రామలింగం, కందుకూరి రాము, చింతా నాగరాజు, వెంకటాచారి, నాగిరెడ్డి, చాంద్‌పాషా, నాగేశ్వరరావు, సత్యనారాయణ, ఉపేందర్, శాంతి వర్ధన్, కోటి, రాము, సూర్యకిరణ్, నరసింహారావు, సాంబయ్య, రోశయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుపై అవగాహన


జూలూరుపాడు: మాట్లాడుతున్న తాళ్లూరి రవి


పాల్వంచరూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ

జూలూరుపాడు/పాల్వంచరూరల్: జూలూరుపాడు మండలం కాకర్ల రైతువేదికతోపాటు పాల్వంచ మండలం పాండురంగాపురంతండా, తవిసలగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శనివారం మునగసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెండు మండలాల ఎంపీడీఓలు మాట్లాడుతూ.. మునగ సాగు సన్న, చిన్నకారు రైతులకు లాభదాయకమని, రైతుల ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీల ద్వారా సన్న, చిన్నకారు రైతులను గుర్తించి అంతర పంటగాను, ప్రత్యామ్నాయ పంటగా మునగ సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో పాల్వంచ ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, జూలూరుపాడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్లూరి రవితోపాటు దీపక్‌ఆనంద్ తులసిరాం, విజయభాను, గోపికృష్ణ, గౌస్, నానిబాబు, జ్యోతి, హారిక, లక్ష్మీనర్సయ్య, ప్రసాద్, బొగ్గ నారాయణ, శంభోశంకర, పోరండ్ల రంగా, రాంబాబు, పుల్లయ్య, అనురిక పాల్గొన్నారు.

కష్టమైనా ఇష్టపడి చదవాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కొత్తగూడెంఅర్బన్: జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే పట్టుదల, క్రమశిక్షణతో కష్టమైనా ఇష్టపడి చదువాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి హెచ్.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. రాబోయే పరీక్షలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. తర్వాత డీఆర్‌డీఏ అసిస్టెంట్ మేనేజర్ అనురాధ మాట్లాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేశ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ బండి వెంకట్వేరరావు, సీనియర్ లెక్చరర్ జాతి రమేశ్, సముద్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర ఇవ్వాలి


మాట్లాడుతున్న వీరబ్రహ్మచారి

టేకులపల్లి: మండలంలో పుట్టగొడుగుల్లా పత్తి చిల్లర కొంటర్లు వెలిశాయని, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కొంటర్లను ఎత్తివేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ మండల కార్యదర్శి ధర్మపురి వీరబ్రహ్మచారి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టపడి పంటలు పండించిన రైతులను చిల్లర కొంటర్ల నిర్వాహకులు దగా చేస్తున్నారని విమర్శించారు. పత్తి క్వింటాల్‌కు రూ.15 వేలు మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జరుపుల సుందర్, బి.పంతులు, బి.లింగ, నాగయ్య పాల్గొన్నారు.

హక్కులు, చట్టాలను రక్షించుకోవాలి


మాట్లాడుతున్న మధు

జూలూరుపాడు: రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ మధు అన్నారు. శనివారం జూలూరుపాడు సీపీఎం కార్యాలయంలో జరిగిన గిరిజన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంఘం వ్యవస్థాపకులు గుగులోత్ ధర్మానాయక్ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలో వచ్చే నెల 5న జరిగే గిరిజన సంఘం సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. లకావత్ శ్రీను, ఇస్లావత్ భద్రు, బానోత్ రూప, బోడా రాజు, బానోత్ శంకర్, భూక్యా మంగ్యా, మల్యా, బోడా సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ లోపంతో సమస్యలు


జూలూరుపాడు: మాట్లాడుతున్న మధువరుణ్

జూలూరుపాడు/టేకులపల్లి/ఇల్లెందురూరల్: అయోడిన్ లోపంతో థైరాయిడ్ గ్రంథి పనితీరు మందగించి వాపు(గాయిటర్) వస్తుందని వైద్యాధికారులు తెలిపారు. శనివారం జూలూరుపాడు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల, టేకుపల్లి మండలంలోని కేజీబీవీ, ఇల్లెందు మండలంలోని సుదిమళ్ల గిరిజన గురుకుల పాఠశాలలో ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రోజూ అయోడైజ్డ్ ఉప్పునే వాడాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, రామకృష్ణ, రత్నకుమార్, పద్మజ, సంతు, దేవా, నాగుబండి వెంకటేశ్వర్లు, సులోచన, చంద్రకళ, సీత, లక్ష్మీ, పద్మ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి


పంటలను పరిశీలిస్తున్న నాయకులు

సుజాతనగర్: ఎంటీయూ 1262 రకం సాగు చేసి నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర నరేంద్రకుమార్, ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో వరి పంట క్షేత్రాలను శనివారం పరిశీలించారు. కల్తీ విత్తనాల మూలంగా వందలాది ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోయాని, పంట నష్టపోయిన విషయం వ్యవసాయాధికారులకు తెలిసినా పరిహారం అందించడంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సలిగంటి శ్రీనివాస్, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, తాళ్లూరి పాపారావు, కొమారి హనుమంతరావు, జక్కుల రాములు, భూక్యా దస్రు, బొడ్డు కేశవరావు, మూడు గణేశ్, వీర్ల మల్లేశ్, ముక్కెర మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు డీఎస్పీ సన్మానం


నరేశ్‌ను సన్మానిస్తున్న డీఎస్పీచంద్రభాను

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ బచ్చల నరేశ్‌ను డీఎస్పీ చంద్రభాను శనివారం సత్కరించారు. పట్టణంలోని జేకే కాలనీకి చెందిన నెహ్రూ.. బస్సు దిగి హడావుడిగా ఇంటికి వెళ్తుండగా పర్సు కిందపడిపోయింది. అదే సమయంలో సుభాష్‌నగర్ నుంచి పట్టణంలోకి ఆటో నడుపుకుంటూ వెళ్తున్న నరేశ్ రోడ్డుపై పడి ఉన్న పర్సును, అందులో ఉన్న రూ.10 వేలు గుర్తించి పోలీసులకు అప్పగించాడు. పర్సు పోగొట్టుకున్న నెహ్రూను పిలిపించి నరేశ్ చేతుల మీదుగా అందజేశారు.

నాణ్యతాలోపంతో చెక్‌డ్యాం నిర్మాణం


మాట్లాడుతున్న నాయకులు

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామ పంచాయతీ చీపురుగూడెం పెద్దవాగుపై నాణ్యతాలోపంతో చెక్‌డ్యాం నిర్మించారని గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్, బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, ఎంహెచ్‌డీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల నరేశ్‌కుమార్ ఆరోపించారు. శనివారం బీఎస్పీ, ప్రజా సంఘాల నాయకులు, రైతులు కలిసి చీపురుగూడెం చెక్ డ్యాంను పరిశీలించారు. రూ.1.75 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యాం ఆనకట్ట అధ్వానంగా, అడ్డగోలుగా నిర్మించారని, చెక్ డ్యాం నిర్మాణ సమయంలో భూములను చిన్నాభిన్నం చేయడంతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించలేదని విమర్శించారు. కార్యక్రమంలో చందావత్ లచ్చు, హుస్సేన్, ఇస్లావత్ నాగు, బానోత్ బిక్కు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ మృతికి సంతాపం

కొత్తగూడెంఅర్బన్: ఇల్లెందు పట్టణం 14వ నంబర్ బస్తీకి చెందిన రేషన్ డీలర్ జ్యోత్స్న అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు కొత్తగూడెంలో జరుగగా జిల్లా రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం మండల అధ్యక్షులు బోడ కృష్ణ, పూల్‌సింగ్ తదితరులు నివాళులర్పించారు.

మహాసభను విజయవంతం చేయండి

ఇల్లెందు: తుడుందెబ్బ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కోకన్వీనర్‌లు సిద్ధబోయిన లక్ష్మీనారాయణ, ఆగబోయిన రవి, ఈసం నర్సింహారావు పిలుపునిచ్చారు. శనివారం ఇల్లెందులో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లోని కొమరంభీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ, రవి మాట్లాడుతూ నవంబర్‌లో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల మహాసభలను నిర్వహించి సంఘాన్ని బలపేతం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కల్తీ రాంప్రసాద్, దారబోయిన రమేశ్, పాయం లక్ష్మీనర్సు, తాటి పుల్లయ్య, కోరం కృష్ణ, ఈసాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.